క్లుప్తంగా

జగనన్న కాలనీలో నీటి సౌకర్యం



మోటార్ అమర్చి నీటిని ప్రారంభిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మల పెంట గ్రామ శివారులోని జగనన్న కాలనీకి నీటి సౌకర్యం కల్పించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చేతి పంపునకు మోటార్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి త్వరగా కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

నేడు గృహ సారథుల సమావేశం

కొలిమిగుండ్ల: స్థానిక షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నియోజవర్గ అబ్జర్వర్ అబ్దుల్‌ఖాన్ హాజరవుతారన్నారు.

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



కొనసాగున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మండల అధికారుల దృష్టికి సీసీ రోడ్లు నిర్మించాలనే గ్రామస్తులు విన్నవించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ.50 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. దీంతో గ్రామంలోని 6, 7, 8, 9, 10 వార్డుల్లో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. సీసీ రోడ్లు వేయడంతో ఆయా కాలనీల రూపు రేఖలు మారిపోతున్నాయి.

ఆర్థిక సాయం



విరాళం అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఆ నల్లురు స్వచ్ఛంద సేవా సంస్థకు సుమేధా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ నాగరాజు ఆర్థిక సాయం అందించారు. సోమవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూర్ బాషాకు రూ.20 వేల నగదును అందజేశారు. అలాగే అదే పాఠశాల ఉపాధ్యాయిని చంద్రకళ తన వంతుగా రూ.3 వేల విరాళం అందజేశారు.

వేతనాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బనగానపల్లె రూరల్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని స్వచ్ఛ భారత్ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యల్లయ్య ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యల్లయ్య మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులు గ్రామాలను, సచివాయాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారన్నారు. అలాంటి కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించక పోవడం తగదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ అధ్యక్షులు సుబ్బయ్య, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు దేవదాసు, తిమ్మరాజు, బాలనాగన్న, సుంకన్న, మంజుల నాగన్న పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి పూజలు

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజ స్తంభానికి సోమవారం సాయంత్రం ఆలయ పురోహితుడు ఆలూరి నరసింహప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల లలితా సుందరేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో రూ.3 లక్షల వ్యయంతో ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు చేయించారు. గ్రామ పెద్దలు, భక్తుల ఆధ్వర్యంలో పునఃసంప్రోక్షణతో విశేష పూజలు నిర్వహించారు.

చేసిన పనులను ప్రజలకు చెప్పండి

- మరోసారి అండగా నిలవాలని కోరండి
- పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి
- కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: మన ప్రభుత్వంలో చేసిన పనులను ప్రజలకు చెప్పి.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరాలని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కన్వీనర్లు, గృహసారథులకు సూచించారు. సోమవారం సంజామల మండల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలను అందించిన విషయాలను, ఎన్నికల హామీలను 95 శాతానికి పైగా అమలు చేసిన విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరాలన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.30 లక్షల మందికి శాశ్వత ప్రాతిపదికన, 4 లక్షల మందికి గ్రామ, వార్డు వలంటీర్లుగా నియమించి ఉపాధి అవకాశాలు కల్పించిన విషయాలను విస్తృత ప్రచారం చేయాలన్నారు.

లోకేష్ పాదయాత్ర అట్టర్‌ప్లాప్

ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా మేలు చేస్తుంటే ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ ఎల్లోమీడియాను అడ్డం పెట్టుకుని దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే రామిరెడ్డి ధ్వజమెత్తారు. 2024 ఎన్నికలకు కుట్రలు, కుతంత్రాలతో చంద్రబాబు నాయుడు సిద్ధమవుతున్న విషయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. నారా లోకేష్ పాదయాత్రలో కనీసం 50 మంది కూడా లేకపోవడం అట్టర్‌ప్లాప్‌కు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పోచా వెంకట్రామిరెడ్డి, యాతం రవిప్రకాష్‌రెడ్డి, శివరామిరెడ్డి, దేశాయ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు శివరామిరెడ్డి, అసద్ అలీఖాన్, ఎస్సీ బాబు, ఉసేనమ్మ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు అందరికీ సంక్షేమ ఫలాలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కనకాద్రిపల్లె సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే చెప్పాలని కోరారు. మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. వృద్ధురాలు నాగమ్మ 'నాయనా పింఛన్ ఇంటి వద్దకే తెచ్చిస్తున్నారు. చాలా సంతోషం' అంటూ ఎమ్మెల్యేకు నమస్కరించడంతో ఆమెతోనూ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కాసేపు ముచ్చటించారు. స్థానికులు కొందరు తాగునీరు, విద్యుత్ స్తంభాల సమస్యలను లేవనెత్తగా మరికొందరు ఇళ్ల స్థలాలు, పింఛన్ మంజూరు చేయాలని విన్నవించడంతో వారు వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పేదవాడి ఇంటికే ప్రభుత్వ పథకాలు చేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని వారు ప్రజలను కోరారు. అనంతరం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. నారాయణరెడ్డి, రాచకుంట వెంకటేష్, శ్రీనివాసులు, సుధాకర్, పెద్ద గంగులు, చిన్న గంగులు, బాల గంగయ్య, మురారి, గిరిబాబు, ఓబుళరెడ్డి, శివరంగయ్య, మల్లయ్య, కంబ గిరిస్వామి, లక్ష్మీరంగమ్మ, మల్లేశ్వరి, మల్లమ్మ, పద్మావతి, భాగ్యలక్ష్మి, మాధవి, తదితరులకు పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు డాక్టర్ దస్తగిరి, సూరపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, టీసీ వెంకట్రాముడు, మాధవ, ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ పాల్గొన్నారు.

గోపూజ పుణ్య ఫలం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: గోపూజ తల్లిదండ్రులకు సేవ చేయడంతో సమానమని పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యాగంటి క్షేత్ర సమీపంలో బుర్ర వెంకటేశ్వర్లు ఏర్పాటు చేస్తున్న యాగంటి బసవన్న గోశాల నిర్మాణానికి వారు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి మాట్లాడుతూ గోశాల ఏర్పాటు అభినందనీయమన్నారు. ఎలాంటి సహకారం కావాలన్నా తాము అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, అమరావతి హైవే డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్టోత్సవాలు

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో ఇటీవల జీర్ణోద్ధరణ గావించిన మారెమ్మ ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్టోత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల ఆర్థిక సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించినట్లు చెప్పారు. 8, 9, 10వ తేదీల్లో వివిధ పూజ కార్యక్రమాలతో మారెమ్మ దేవత, పోతురాజు స్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులు ప్రారంభం



రామాపురం కొండల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామస్తులకు గ్రామ సమీపంలోని జొన్నలరాశికొండలో సోమవారం ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము చౌడమ్మ మాట్లాడుతూ తమ గ్రామస్తులకు ఇంతవరకు ఉపాధి పనులు ఎవరూ కల్పించలేదన్నారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విషయం తెలుసుకుని అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామారావు, పాల నాగిరెడ్డి, గిరి, ప్రమోద్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

శివస్వాముల గ్రామోత్సవం



గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న యువకులు

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పట్టణ ప్రధాన వీధుల మీదుగా శివపార్వతుల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో గొరవయ్యల నృత్యాలు, చెక్కభజన, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు శివపార్వతులకు పూజలు నిర్వహించారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి

బనగానపల్లె: ప్రభుత్వ పెన్షనర్లు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని బనగానపల్లె డివిజన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఐఎస్ పక్కీర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని పెన్షనర్లు స్థానిక పెన్షనర్ల కార్యాలయానికి ఆధార్ నంబరు, సీఎంఎఫ్ నంబరుతో వచ్చి ఈ నెల చివరిలోపు అనుసంధానం చేయించుకోవాలని సూచించారు.

పోస్టర్ విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం.

డోన్ టౌన్: గెత్సేమనే ప్రార్థన పోస్టర్‌ను స్థానిక మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ వద్ద సోమవారం నాయకులు రెవరెండ్ బందెల రాజు, రెవరెండ్ ఆనందరావు తదితరులు విడుదల చేశారు. ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

- సీనియర్ సివిల్ జడ్జి తంగమణి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి తంగమణి

డోన్ టౌన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞకర్మ కృషి చేయాలని మండల న్యాయ విజ్ఞాన కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. సోమవారం స్థానిక కోర్టు భవనంలో బాల్య వివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్, ఎయిడ్స్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, హాజరైనా చట్టం ప్రకారం శిక్షార్హులన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ఈ నెల 11న జరగబోయే జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియకర్ సివిల్ జడ్జి తంగమని సూచించారు. డోన్ కోర్టు పరిధిలోని పెండింగ్ కేసుల వివరాలు, రాజీ అయ్యే అవకాశాలున్న కేసుల వివరాలను వివిధ పోలీసు స్టేషన్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల్లో రాజీ అయ్యే పరిస్థితులు ఉన్న వారిని జాతీయ లోక్ ఆదాలత్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్‌ఖాన్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హనీషా, సీఐలు, ఎస్‌ఐలు, డోన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరసింహులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లెలో గంగజాతర(ఆవుల పబ్బం)ను గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మ ఆలయం వద్దకు సాయంత్రం గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో గ్రామస్తులు సామూహిక పొంగుపాలు కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక పల్లకీలో అమ్మవారిని కొలువుంచి ఆలయం నుంచి మేళతాళాలతో వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు, సభ్యులు

బేతంచెర్ల: స్థానిక శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దాత వెల్డింగ్ మహబూబ్ సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వలీబాషా, సభ్యులు మహేష్, ఇద్రూస్, మాధవరెడ్డిలు రోగులకు, గర్భిణులు, వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసులు, చరన్ రాజు పాల్గొన్నారు.

ల్యాబ్ తనిఖీ



ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో సమావేశమైన అధికారులు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని ల్యాబ్‌లను సోమవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలాజీ, నంద్యాల జిల్లా మెడికల్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో ఏఏ పరీక్షలు, రోజుకు ఎన్ని పరీక్షలు నిర్వహిస్తున్నారనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషెంట్లు ఎంత మంది వస్తుంటారని, వారికి సకాలంలో వైద్య పరీక్షల ఫలితాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, డాక్టర్ల బృందం, సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

పల్లెలకు భవంతుల శోభ

- మురిసిపోతున్న ప్రజలు



ఆర్ కొత్తపల్లె గ్రామంలో గ్రామ సచివాలయ భవనం

బేతంచెర్ల: ప్రభుత్వ నూతన కార్యాలయాల ఏర్పాటుతో పల్లెలు కొత్త శోభ సంతరించుకుంటున్నాయి. సాధారణంగా గ్రామాల్లో ఎత్తైన భవనాలు కనుచూపుమేర కనిపించవు. కానీ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు లాంటి నూతన భవన నిర్మాణాలతో పల్లెల్లో కొత్త కల కనిపిస్తోంది. ఇది మా గ్రామ సచివాలయం, అది మా రైతు భరోసా కేంద్రం, అక్కడ కనిపించేది హెల్త్ సెంటర్, అది పాల కేంద్రం అంటూ ప్రజలు మురిసిపోతున్నారు. అధికారులు సైతం మా కార్యాలయం అంటూ గొప్పగా చెప్పుకునేలా కార్యాలయాలు రూపుదిద్దుకుంటున్నాయి.

ప్రజల చెంతకే పాలన.

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమైంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రజల చెంతకు పాలన అందిస్తూ రాష్ట్ర ప్రజల మన్నలను పొందుతున్నారు. గ్రామ పరిపాలన ప్రజలకు అందించడమే గాకుండా పరిపాలన సౌలభ్యం కోసం నూతన కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వీటి భవన నిర్మాణాలకు వేల కోట్ల రూపాయలు మంజూరు చేశారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేశారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో నూతన కార్యాలయాలతో పల్లెల్లో కొత్త శోభను సంతరించుకోవడమే కాకుండా గ్రామ సర్పంచ్ మొదలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు రెవెన్యూ, మండల పరిషత్ ఉద్యోగులు, వైద్య సిబ్బంది వ్యవసాయ శాఖ ఇలా పలు కార్యాలయాల ఉద్యోగులు ప్రజలకు సేవలు అందజేస్తూ ప్రశంసలు అందుకున్నారు.

కోట్ల నిధులు మంజూరు

ఒక్కో గ్రామ పంచాయతీకి సచివాలయ ఏర్పాటుకు రూ.40 లక్షలు, సబ్ సెంటర్లకు రూ.17.5 లక్షలు, ఆర్‌బీకేలకు రూ.23 లక్షలు, పాలకేంద్రాలకు రూ.14 లక్షల చొప్పున రూ.94.5 లక్షలతో అంటే దాదాపు కోటి రూపాయల నిధులు మంజూరు చేసి నూతన కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ పరిపాలనలో భాగంగా నూతన సచివాలయ కేంద్రాల ఏర్పాటుతో పల్లెలో ప్రజా పాలన సాగడం ప్రారంభమైంది. వలంటీర్లు సహకారంతో ప్రతి పల్లెలో రేషన్ కార్డు మొదలు, రైతన్నలకు, వృద్ధులకు ఆరోగ్య సేవలు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, పాల అమ్మకాలు ఇలా అన్ని రకాల ప్రజా సేవలు ఆయా పల్లెల్లోనే అందుతున్నాయి. ఫలితంగా ఆ గ్రామ ప్రజలు సుదూరంగా ఉన్న మండల కేంద్రాల వెళ్లకుండానే వారి వారి ప్రజా సంక్షేమ పథకాలు పొందుతున్నారు.

జగనన్న చరిత్ర సృష్టించారు



ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ స్థాయిలోనే గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రం, బల్క్ మిల్క్ కేంద్రాల ఏర్పాటు తో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారు. వీలైనంత వరకు గ్రామ సచివాలయంలోనే సంక్షేమ పథకాల నమోదు తోపాటు మండల కేంద్రానికి వెల్ల కుండా గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిస్కారం అవుతున్నాయి.

– వెంకటేశ్వర్లు, గోరుమానుకొండ సర్పంచ్

సమీపంలోనే సచివాలయం



మండల కేంద్రానికి రావాలంటే మా గ్రామం 9 కిలో మీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం మా గ్రామంలో గ్రామ సచివాలయం ఉండటంతో చాలా సౌకర్యంగా ఉంది. గ్రామంలోని రైతులు, ప్రజలు, వృద్ధులు సైతం గ్రామ సచివాలయాల దగ్గరకు వెళ్లి తమ సమస్యలను విన్నవిస్తున్నారు. మండల కేంద్రానికి వెళ్లకుండా సచివాలయంలోనే సమస్యలు పరిష్కారం కావడం నూతన పరిపానలకు శ్రీకారం చుట్టారు సీయం.

– బుగ్గన కుమార్ రెడ్డి, ముద్దవరం గ్రామం

10న మెగా జాబ్ మేళా

డోన్ టౌన్: ఈనెల 10న స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తునట్లు డోన్ న్యాక్ సెంటర్ కోఆర్డినేటర్ నాగవిష్ణేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 10 కంపెనీల ప్రతినిధులు హాజరై 465 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. మరిన్ని వివరాలకు 8897694291, 9985250538, 7981238237, 6303397635 సంప్రదించాలన్నారు.

నేడు బైకుల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సరైన రికార్డులు లేకుండా పట్టుబడిన 25 బైకులకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ కృష్ణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన రికార్డులు ఉంటే బైకు యజమానులు తీసుకెళ్లాల్సిందిగా కోరారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన షరీఫ్ (36) చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. కొద్ది రోజులుగా టీబీతో బాధతుపడుతున్న షరీఫ్ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. బంధువులు వెంటనే కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య బీబీతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తిరుపాల్ తెలిపారు.

